## క్లుప్తంగా

### విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

**రెంటచింతల:** పంటల సాగు సమయంలో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన అధిక దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు పంటలను సాగు చేసే సమయంలో విత్తనశుద్ధి చేసుకోవడం వలన పలు ప్రయోజనాలను పొందవచ్చనని తెలిపారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేయాలన్నారు. నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాల ను మాత్రమే నారు పోసుకోవాలన్నారు. ఒక కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24గం.ల నానబెట్టిన అనంతరం మరో 20 గం. నుంచి 24 గం. పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లు కోవాలన్నారు.

### సబ్సిడీపై డ్రోన్లు

**కారెంపూడి:** పంటలకు ఎరువులు, పురుగు మందులు చల్లడానికి ఉపయోగపడే డ్రోన్లను 80 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పోట్ల నరసింహారావు శుక్రవారం తెలిపారు. రైతులు రూ.రెండు లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే ప్రభుత్వం మిగతా మొత్తాన్ని విడుదల చేస్తుందని చెప్పారు. రెండు రోజులు మాత్రమే దరఖాస్తులకు గడువు ఉందని ఆసక్తి ఉన్న రైతులు సంప్రదించాలని ఏఓ కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**మాచర్ల:** విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు హరిబాబు, ఎ.రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. దుర్గి, ధర్మవరం, పోలేపల్లి, కోలగుట్ల, ఎస్ఎస్‌తండా ముటుకూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


### సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాముడు

**కారెంపూడి:** కారెంపూడి వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) అధ్యక్షుడుగా నాగారావు రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, మాజీ ఎంపీపీ రమావతు నాగులు నాయక్ తదితరులు పాల్గొన్నారు. రైతులకు సొసైటీ పరంగా అందించాల్సిన సేవలను అందిస్తానని బీసీ అయిన తనకు పదవి అప్పగించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

**కారెంపూడి:** గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో గ్రామానికి చెందిన తోట అల్లయ్య ట్యాంకర్ ద్వారా శుక్రవారం తాగు నీటిని సరఫరా చేయించారు. కొన్ని చోట్ల బోర్లలో నీరింకిపోవడంతో ఆ ప్రాంతాల ప్రజలకు నీరందని పరిస్థితిని గమనించి అల్లయ్య సరఫరా చేయడానికి ముందుకొచ్చారు. కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు పంగులూరి అంజయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి ప్రారంభించారు.

### శాకంబరి దేవిగా అంకమ్మ తల్లి



**పెదకూరపాడు:** చల్లంగా చూడమ్మా అంకమ్మ తల్లి అంటూ భక్తులు పెద్ద సంఖ్యలో పెదకూరపాడు గ్రామ దేవత అంకమ్మ తల్లికి ఆషాడ మాస పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంకమ్మ తల్లి అమ్మవారిని శుక్రవారం శాకాంబరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్ల నివేదన గావించారు. శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీధర్, ఉపాధ్యక్షుడు దుప్పటి చిన్న బాబు, కార్యదర్శి కర్ణం శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో అమ్మవారిని శాకంబరిగా కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భజన మాస్టర్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ భక్త సమాజాల వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### సత్తెనపల్లి ఏడీఏగా రవిబాబు

**సత్తెనపల్లి:** సత్తెనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) గా బోయపాటి రవిబాబును నియమించారు. వ్యవసాయ శాఖలో గత నెల 9న బదిలీలు జరిగినప్పటికీ వాటిల్లో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి అటాచ్‌మెంట్ నిమిత్తం వచ్చిన రవి బాబును సత్తెనపల్లికి బదిలీ చేశారు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏడీఏగా ప్రస్తుతం ముప్పాళ్ళ మండల వ్యవసాయ అధికారి ఐ.శ్రీధర్ రెడ్డి కొనసాగుతున్నారు. సోమవారం రవిబాబు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## మోసం, వంచన..

# సీఎం చంద్రబాబుకు అలవాటు

- హామీలిచ్చారు.. ప్రజలను మోసగించారు..
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ విస్తృత ప్రచారం
- సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్

**మాచర్ల:** రాష్ట్రంలో అధికారంలోకి రావటం కోసం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో హామీల మీద హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయటమే పనిగా చేసుకున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కారంపూడి మండల నాయకుల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ కారంపూడి మండల అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. కారంపూడి మాజీ ఎంపీపీ పంగులూరి వెంకట నర్సయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కొమ్ము చంద్రశేఖర్, పార్టీ మండల నాయకుడు బొమ్మన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీను మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఇప్పటికీ మోసం చేయటమే భాగంగా సీఎం చంద్రబాబు, వైఎస్ జగన్ మోహన్‌పై ఎదురుదాడి చేస్తూ హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక తనదంతా హైటెక్ అని చెప్పి చదువుకు, సంక్షేమానికి పేదలను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ సూపర్ సిక్స్ అని చెప్పి 15 నెలలైనా పింఛన్, తల్లికి వందనం కార్యక్రమాన్ని మాత్రమే అమలు చేశారన్నారు. మిగిలినవన్నీ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇటువంటి విధానాలను అనుసరిస్తున్న కూటమి ప్రభుత్వంపై గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకెళ్తామన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి కొమ్మారెడ్డి యర్ర గురవారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జాన్‌పాల్ నాయక్, జిల్లా నాయకులు చిలుకూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో టీడీపీ మోసాలు విస్తృతంగా ప్రచారం చేసి రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ మోసగింపు చర్యలను ప్రచారం చేసి మళ్లీ జగన్‌ను సీఎం చేసేవరకు తాము వెనుకాడేది లేదంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేశానే. తొలుత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా జిల్లా కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వైఎస్ జగన్ సైన్యం ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఆయా గ్రామాల నుంచి భారీ స్థాయిలో తరలివచ్చి సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీనివాసరావు, కారంపూడి మండల నాయకులు కిలారి రత్నకుమారి, బొగ్గవరపు నాగరాజు, కాటా శ్రీనివాసులు, వజ్రాల వెంకటరామిరెడ్డి, దరివేముల కిరణ్, కాశీవిశ్వనాథం, కె శివారెడ్డి, దొంతి అంజి, జిల్లా యూత్‌కార్యదర్శి బైరెడ్డి బసివిరెడ్డి, వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

## కార్మికుల సమస్య పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



ఐలాండ్ సెంటర్‌లో సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**పిడుగురాళ్ల:** మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి కోరుతూ ఐలాండ్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... కార్మికులు గత ఆరు రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకొట్టినట్లుగా కూడా లేదని, వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు, మూడు రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, జీఓ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫట్స్, సమ్మె కాలపు వేతనాలు వెంటనే అమలు చేయాలని, ఎటువంటి నిబంధన లేకుండా తల్లికి వందనం, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. అదే విధంగా ఆ ప్రాంతంలోని వ్యాపారులు సమ్మె శిబిరానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రమేష్, ప్రతాప్, మధుసూదన్‌రావు, గాలి పవన్‌కుమార్, నాగుల్ మీరా, కాంద్రగుంట నాగేశ్వరరావు, కంపా సాగర్‌బాబు, కోడిరెక్క మేరమ్మ, మార్తమ్మ, కంప చిన్న వీరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలందించండి

**విద్యుత్ ఎస్ఈ డాక్టర్ విజయకుమార్**

**మాచర్ల:** వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని విద్యుత్ ఎస్ఈ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ డివిజినల్ కార్యాలయంలో ఏడీఈలు, ఏఈలు, అకౌంట్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో లోపాలు ఉన్నాయనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు వినియోగదారుల సమస్యలను పరిష్కరించి ముందంజలో ఉండాలని కోరారు. అదే విధంగా డివిజినల్ పరిధిలోని అన్నీ మండలాలలో బిల్లుల వసూలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బకాయిలు వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేయాలన్నారు. ప్రభుత్వ పీఎం సూర్యాఘర్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లుతో పాటు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఆయన సమీక్షించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.సింగయ్య పాల్గొన్నారు.

## 21న చలో డీజీపీ కార్యాలయం

**నెహ్రూనగర్:** రజక మహిళ తోరటి అనూష మృతిపై విచారణ జరపాలని కోరుతూ ఈ నెల 21న చలో డీజీపీ కార్యాలయం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రజక వృత్తి దోభీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ కాలనీలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 13, 2025న గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిన రజక మహిళ అనూష అనుమానాస్పద మరణంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతి పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.అనూష తల్లి సామ్రాజ్యం మాట్లాడుతూ భార్యని అడ్డుతొలగించుకోవాలనే పథకం ప్రకారం దారుణానికి పాల్పడినట్లు ఆరోపించారు.

## పోలింగ్ బూత్ ఏర్పాటుకు పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీటీ అరుణకుమారి

**బెల్లంకొండ:** మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నూతన పోలింగ్ బూత్ ఏర్పాటు చేసేందుకు శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలన చేశారు. గ్రామంలో బూత్ నెంబర్ 23, 24, 25 మూడు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. కాగా 23వ బూత్ లో అధిక ఓట్లు ఉన్నందువలన మరో అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటుకు అధికారులు సూచించారు. దీంతో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ కె.అరుణకుమారి గ్రామ రెవెన్యూ సిబ్బందితో కలిసి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. వారి వెంట ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సింగారెడ్డి బ్రహ్మరెడ్డి, నాయకులు బత్తుల వెంకట్రావు, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, సిద్దల రాజేష్ ఉన్నారు.

## కంభంపాడులో మంత్రుల పర్యటన



శంకుస్థాపన చేస్తున్న మంత్రులు అనిత, రవి

**పెదకూరపాడు:** మండలంలోని కంభంపాడులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటించారు. ఈ సందర్భంగా రూ.1.50 కోట్లతో నిర్మించిన జలాలపురం–కంభంపాడు రోడ్డును ప్రారంభించారు. రూ.2 కోట్లతో కంభంపాడు–ఉంగుటూరు వరకు నిర్మించనున్న తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ రానున్న నాలుగు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయి మద్దతు ఇస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్న సాంబశివరెడ్డి, అర్తిమల్ల రమేష్, ఏటుకూరి బ్రహ్మయ్య, పాటిబండ్ల బాలయ్య, ముంతాజ్ పాల్గొన్నారు.

## ఎముకల సాంద్రతపై వైద్యశిబిరం



**నరసరావుపేట ఈస్ట్:** చిన్నతనం నుంచే ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ ఫర్జానా పర్వీన్ తెలిపారు. గుంటూరు రోడ్డులోని కే–రిడ్జ్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఫర్జాన హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఎముకల సాంద్రత పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఫర్జానా పర్వీన్ మాట్లాడుతూ బాలికలకు యుక్తవయస్సులో వచ్చే ఋతుక్రమంలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్య దశలో తలెత్తే అనారోగ్య సమస్యలకు ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ పాల్గొన్నారు.

## గడ్డిమందు తాగి వివాహిత బలవన్మరణం



కొల్లి పార్వతి

**నాదెండ్ల:** క్షణికావేశంలో వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాలు.. జంగాలపల్లె గ్రామానికి చెందిన కొల్లి పార్వతి (25) ఐదేళ్ల క్రితం తూబాడు గ్రామానికి చెందిన పోలు రాజుతో వివాహమైంది. వీరికి ఇరువురు మగసంతానం. కొద్దిరోజుల క్రితం ఒక కుమారుడికి జ్వరం రావటంతో మందులు వినియోగిస్తున్నారు. కుమారుడికి సకాలంలో మందులు వేయటం లేదంటూ పార్వతిపై భర్త పోలురాజు ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలానికి వినియోగించే గడ్డి మందు తాగింది. గమనించిన పోలురాజు భార్య పార్వతిని తన ద్విచక్రవాహనంపై నరసరావుపేట మహాత్మాగాంధీ ఆసుపత్రిలో చేర్పించాడు. శుక్రవారం ఉదయం ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై పార్వతి తండ్రి మొక్కల వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓపెన్ స్కూలుకు దరఖాస్తుల ఆహ్వానం

**నాదెండ్ల:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమన్వయకర్త రవీంద్రనాథ్, జిల్లా సమన్వయకర్త హుస్సేన్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు చెప్పారు. ఓపెన్ స్కూలులో చదివేందుకు 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుతున్నాయని, ఈ నెల 31తో గడువు ముగియనుందన్నారు. ప్రవేశానికి అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.100లు, అడ్మిషన్ ఫీజు రూ.1300లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 14 ఏళ్ళు నిండిన వారు పదో తరగతి ప్రవేశానికి, 15 ఏళ్ళు నిండి పదో తరగతి పాసైన వారు ఇంటర్మీడియట్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సరళమైన సార్వత్రిక విద్యావిధానంలో ఏడాదికి 30 ఆదివారాలు తరగతులు జరగనున్నట్లు తెలిపారు. మహిళలు, వృత్తి, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఉన్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణారెడ్డి, హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 21 నుంచి ఉచిత యోగ శిక్షణ

**నరసరావుపేట ఈస్ట్:** శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 188వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగ గురూజీ కూనిశెట్టి వెంకట జనార్దనరావు శుక్రవారం తెలిపారు. శ్రీపట్టాభి రామస్వామి ఆలయంలోని శ్రీవేంకటేశ్వర కల్యాణమండపంలో 28 రోజుల పాటు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ శిబిరంలో 42 యోగ భంగిమలు, ఆహార నియమాలు, ధ్యానం, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు బోధించనున్నట్లు వివరించారు. వివరాలకు 9490846333, 9491665733 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### చెరువులోకి దిగి వృద్ధురాలు మృతి

**చిలకలూరిపేటటౌన్:** చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మీకాంతమ్మ (70) గ్రామం పరిధిలోని చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని తాగునీటి చెరువులో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు దిగి కాలుజారి నీటి మునగడంతో ఈ ప్రమాదం నెలకొంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం నుంచి బయటకు తీసే అవకాశం లేకుండా పోయిందని, సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన వెళ్లి ఆమె మృతదేహాన్ని వెలికితీశారని చెబుతున్నారు. అనంతరం గ్రామంలోనే అంత్యక్రియల నిర్వహణ పూర్తి చేశారు. అయితే ఆమెకు మతిస్థిమితం లేని కారణంగా ఇలా ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

### మహిళల అభ్యున్నతికి కృషి

**రొంపిచర్ల:** మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు హోమ్ నీడ్స్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ గృహోపకరణ వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలకు యూనివర్సిటీ తరపున సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.వి.రమణ, డీఆర్‌డీఏ ఏపీఎం సోమశేఖర్ పాల్గొన్నారు.

## కేటగిరీల వారీగా జీతాలు చెల్లించాలి

**ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన నాయకులు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు**



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

**నరసరావుపేట:** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కేటగిరీల వారీగా జీతాలు పెంపుదల అమలు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో ఆరో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. తొలుత సమ్మెలో ఉన్న కార్మికులను ఉద్దేశించి జిల్లా కోశాధికారి డి.శివకుమారి మాట్లాడుతూ జీవో నంబరు 36ను అనుసరించి కార్మికులకు రూ.21 వేలు, రూ.24,500లు జీతాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో విడుదలైన జీఓలను అనుసరించి ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్‌సీ జీతాలు, కరువు భత్యం, టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు అమలు చేయాలని అన్నారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక ఒప్పందం మేరకు 2019 జనవరి నుంచి అమలు చేస్తామన్న సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలైన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా పెంపుదల, దహన సంస్కారాలకు రూ.20 వేలు చెల్లింపు, ఎటువంటి షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు కోసం జీఓలు జారీ చేయాలని కోరారు. చనిపోయిన, అనారోగ్యంపాలైన వారి కుటుంబాలలోని పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, ఆప్కాస్‌లోని వారందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచి చట్టబద్ధమైన సెలవులు, కిట్లు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 12 వేల మంది ఇంజనీరింగ్ కార్మికులకు తమ నైపుణ్యానికి తగిన జీతాలు లభించకపోవటంతో పెరిగిన నిత్యావసరాల ధరల వలన వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల డిమాండ్లను ఆమోదించి సమ్మెతో ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలను తొలగించాలని కోరారు. దీనిలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, బండారుపల్లి నాగేశ్వరావు, లక్ష్మారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, షేక్ చిన్న అల్లా బక్షు, సోమశేఖరు, కుంచాల శ్రీనివాసరావు, బాలాజీ సింగ్, షకీలా శ్రీను నాయకత్వం వహించారు.

## తపాలా ఏజెంట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

**నరసరావుపేట టౌన్:** నరసరావుపేట పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలకు ఏజెంట్లుగా పనిచేసేందుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్ అర్హత కల్గిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ డివిజన్ సూపరిండెంట్ మహమద్ జాఫర్ సాధిక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు స్థానిక హెడ్‌పోస్టాఫీసులో 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌ను ఎన్ఎస్‌సీ బాండ్స్ రూరంలో పూచీకత్తు సమర్పించాలన్నారు. వివరాలకు 08647–222244, 9494642465లను సంప్రదించాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో పిచికలపాలెం వాసి దుర్మరణం

**శావల్యాపురం:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారి మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు ఒరిస్సా రాష్ట్రం నుంచి నరసరావుపేట నుంచి గిద్దలూరు వైపు వెళుతున్న షిఫ్ట్ డిజైర్ కారు బయలుదేరింది. ఈక్రమంలో మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన తిరివీధి రత్తయ్య (49) రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలో తన బంధువుల ఇంటికి వెళ్ళి బైకుపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యంలో శావల్యాపురం మండలం కృష్ణాపురం గ్రామం సమీపంలో జాతీయ రహదారి మార్గంలో వెనుక నుంచి అతివేగంతో కారు, బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో మృతుడు రత్తయ్య తలకు బలమైన గాయాలు కావటంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడుకి భార్య కుమార్తె కలరు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈప్రమాదంలో బైకు నుజ్జునుజ్జు అయ్యింది.



## స్టార్టప్‌లపై యువత దృష్టి సారించాలి



**నరసరావుపేట రూరల్:** యువత ఉద్యోగాలు వేతకకుండా ఉపాధి అవకాశాలు సృష్టించే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని విజ్ఞాన్ టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యుబేటర్ సంస్థ మేనేజర్ అబ్దుల్ రియాజ్ తెలిపారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటర్ ప్రెన్యూయర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ షేక్ నజీమా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంకేతికతను ఆధారంగా చేసుకొని స్టార్టప్‌లు ప్రారంభించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీంమొహిద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.